


గ్రామీణ యువత క్రీడల్లో సత్తా చాటాలి

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు ప్రారంభించిన ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - పాలకోడేరు

గ్రామీణ యువత క్రీడల్లో సత్తా చాటాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. గ్రామీణ యువతకు స్కూల్‌గేమ్స్ పోటీలు ఎంతగానే ఉపయోగపడతాయన్నారు. శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ అండర్-14 బాలుర, బాలికల పోటీలను గురువారం డిఇఒ నారాయణతో కలిసి ఆయన ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే పోటీలను క్రీడాజ్యోతి వెలిగించి లాంఛనంగా ప్రారంభించారు. 13 జిల్లాల నుంచి సుమారు 390 మంది క్రీడాకారులు తరలిరాగా తొలిరోజు లీగ్ మ్యాచ్‌లు ఉత్సాహపూరితంగా సాగాయి. 29న ఫైనల్ పోటీలు జరుగుతాయని టోర్నమెంట్ పరిశీలకులు కల్పన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 హరిఆనందప్రసాద్, ఎస్ఎఫ్ కార్యదర్శి పిఎస్ఎన్.మల్లేశ్వరరావు, హెచ్‌ఎం కాశీజగన్నాథరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి చిట్టిబాబు, ఎమ్‌డి.ఖుద్దీస్ పాల్గొన్నారు.



రామం, స్వామినాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసిన నేతలు

ధన్యజీవి ఉద్దరాజు రామం

మోడీ పాలనలో లక్ష మంది రైతులు ఆత్మహత్య

కార్పొరేట్లకు రాయితీలు, రైతులకు ఆత్మహత్యలా?

అఖిల భారత కిసాన్ సభ ఆలిండియా అధ్యక్షులు అశోక్ ధావలే

వ్యవసాయంలో చైనా విధానం ఆదర్శం

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య

రైతాంగ సమస్యలపై ఐక్య ఉద్యమాలు

ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ కార్యదర్శి బి.బలరాం

ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ సేవలు ప్రారంభం

ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన సీతారాం



అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

జమిందారులకు వ్యతిరేకంగా రైతాంగ పోరాటంలో రైతాంగ సమస్యల పరిష్కారానికి కష్టపడి పని చేసిన ఉద్దరాజు రామం ధన్యజీవి అని అఖిలభారత కిసాన్ సభ ఆల్ ఇండియా అధ్యక్షులు అశోక్ ధావలె అన్నారు. రైతాంగ సమస్యలపై రామం పోరాటం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. స్థానిక ఎఎస్‌ఆర్ నగర్‌లోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉద్దరాజు రామం 31వ వర్ధంతిని పురస్కరించుకుని 'రైతాంగ సమస్యలు-ప్రభుత్వాల బాధ్యత' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. తొలుత అల్లూరి సాంస్కృతిక కేంద్రం ప్రాంగణంలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి, ఉద్దరాజు రామం, స్వామినాథన్ చిత్రపటాలకు అశోక్ ధావలె, వి.కృష్ణయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళు అర్పించారు. రామం ఫౌండేషన్ సభ్యులు, రైతు కార్యాచరణ సమితి నేతలు, రైతుసంఘం నేతలు, వలి, ఆక్వా రైతులు, మేధావులు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సెమినార్‌కు ఉద్దరాజు రామం ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన సీతారాం అధ్యక్షత వహించారు. ముఖ్యవక్త అశోక్ ధావలె మాట్లాడుతూ విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, రైతాంగ ఉద్యమ నేత ఉద్దరాజు రామం, పుచ్చలపల్లి సుందరయ్య వంటి మహనీయులు నడియాడిన నేలకు తాను రావడం ఆనందంగా ఉందన్నారు. జాతీయోద్యమంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, అల్లూరితోపాటు లక్ష మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని, 10 లక్షల మంది జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. ప్రతి సంవత్సరం సుమారు 10 వేల మందికిపైగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుండటం అత్యంత బాధాకరమన్నారు. దేశంలో ట్రంప్ టారిఫ్ భారాలతో రైతాంగం తీవ్ర ఇబ్బందుల్లో కూరుకుపోయిందన్నారు. ముఖ్యంగా ఆక్వా రైతులు నష్టపోతున్నారన్నారు. మోడీ నేతృత్వంలో ఆర్ఎస్ఎస్, బిజెపి ప్రభుత్వం మెజార్టీ లేక బీహార్‌లో నితీష్‌పై, ఆంధ్రాలో బాబుపై ఆధారపడి అధికారంలో ఉందన్నారు. రైతుల ఆత్మహత్యల్లో దేశంలో మొదటి ఐదు స్థానాల్లో మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మధ్యప్రదేశ్ ఉన్నాయన్నారు. ఆకలి సూచిలో 123 దేశాల్లో 103వ స్థానంలో మన దేశం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతంలో పేదరికం పెరుగుతుందన్నారు. కౌలు రైతులు ఆ భూమిలోనే ప్రాణాలు వదులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వామినాథన్ చెబుతున్న గిట్టుబాటు ధర ఎక్కడా ఇవ్వడం లేదని, క్వింటాకు రూ.3 వేలిస్తూ ఎంఎస్.స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం కేరళ ప్రభుత్వం ఒక్కటేనన్నారు. మోడీ ప్రభుత్వం పదేళ్లలో రూ.16 లక్షల కోట్ల రుణ బకాయిలను కార్పొరేట్లకు రద్దు చేసిందన్నారు. రైతులకు మాత్రం ఒక్కరూపాయి కూడా ఇవ్వడం లేదన్నారు. నిరుద్యోగానికి, పేదరికానికి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా నిలిచి పోరాడినప్పుడే మార్పు వస్తుందని కారల్ మార్క్స్ వందల ఏళ్ల క్రితమే దిశానిర్దేశం చేశారని గుర్తు చేశారు. దేశంలో రైతాంగ పోరాటం ఆదర్శనీయమన్నారు. మోడీ మెడలు వంచిన ఘనత ఆ రైతాంగానికి ఉందన్నారు. నేడు లేబర్ చట్టాలు కుదించి నాలుగు కోడ్‌లుగా చేసి కార్పొరేట్లకు అనుకూలంగా మార్చారని మండిపడ్డారు. మోడీ నిరంకుశ పాలనపై సమరశీల పోరాటాలు, ఐక్య ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వ రంగాన్ని, రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అదే ఉద్దరాజు రామంకు ఇచ్చే ఘన నివాళులన్నారు. అనంతరం అశోక్‌ధావలెను ఘనంగా సత్కరించారు.

రైతాంగ సమస్యలపై ఐక్య ఉద్యమాలు

ఉద్దరాజు రామం ఫౌండేషన్ కార్యదర్శి, రైతుసంఘం రాష్ట్ర నేత బి.బలరాం



దేశంలో, రాష్ట్రంలోని రైతాంగ సమస్యలపై మా ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తుంది. ట్రంప్ టారిఫ్ వల్ల నష్టపోతున్న ఆక్వా రైతులను ఆదుకోవాలి. పాడి, తమలపాకు, కోకో, ఆయిల్‌పామ్, మొక్క జొన్న, పొగాకు పంటల రైతులందరూ ధర లేక ఇబ్బంది పడుతు న్నారు. డెల్టా ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలి. ఎత్తిపోతల పథకాలను ప్రారంభించి సాగునీటిని అందించేలా ప్రభుత్వం కృషి చేయాలి. పోలవరం ప్రాజెక్ట్‌ను తక్షణం పూర్తి చేయాలి. ప్రాజెక్టు పూర్తి చేయడం అంటే అక్కడి ప్రజలకు నష్టపరిహారం ఇచ్చి, పునరావాసం కల్పించడం. వివిధ అభివృద్ధి పనుల పేరుతో రైతుల నుంచి సేకరిస్తున్న భూములకు తగిన విధంగా నష్టపరిహారం ఇవ్వాలి. భూసేకరణ చట్టం 2013 ఎక్కడా అమలు కావడం లేదు. రైతుల సమస్యలపై భవిష్యత్‌లో రైతుసంఘం, కౌలురైతుల సంఘం, ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తాం.

వ్యవసాయంలో సోషలిస్టు చైనా విధానం మన దేశానికి ఆదర్శం

రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య



దేశంలో వ్యవసాయం చేసే రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నా పట్టించుకోని ప్రభుత్వాలకు సోషలిస్టు చైనా వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన విధానాలు చాలా ఆదర్శ యమని ఏపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య అన్నారు. రైతులు వ్యవసాయం చేస్తే అమ్మే గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత అక్కడి ప్రభుత్వమే తీసుకుంటుందన్నారు. ఆ దేశంలో వచ్చే ప్రతి నూతన టెక్నాలజీని వ్యవసాయానికి ఉపయోగిస్తారన్నారు. ప్రతి మూడు నెలలకోసారి ఆ దేశ కుటుంబ సభ్యుల ఆదాయాలపై పరిశీలి స్తారు. ఒకవేళ తగ్గితే ఎందుకు తగ్గిందో అందుకు కారణాలు విశ్లేషించి తగ్గిన ఆదాయాన్ని నేరుగా బ్యాంకులో వేసే విధానం ఉందని వివరించారు. వృద్ధాప్యంలో ఉన్న ఆరు కోట్ల మంది ప్రజల బాధ్యత ప్రభుత్వమే తీసుకొని వారికి అండగా నిలుస్తుందన్నారు. ఇంతలా రైతాంగానికి, ప్రజలకు సోషలిస్టు చైనా విధానాలు ఆదర్శంగా ఉంటే మన దేశంలోని ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్ప గించాలని చూస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ 2047లో 10 శాతం మంది వ్యవసాయం చేస్తే చాలని చెప్పడం కార్పొరేట్లకు ఎంతలా ఊడిగం చేస్తున్నారో అర్థమవుతుందన్నారు.

రైతులకు అండగా రామం

ఉద్దరాజు రామం ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన సీతారాం



సాధారణ రైతు కుటుంబంలో పుట్టి, రైతుగా ఉండి స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న సమరయోధులు ఉద్దరాజు రామం. రైతుబిడ్డగా కనిపిస్తూనే తన కృషిని, ప్రతిభను అభివృద్ధి చేసుకుని జిల్లా రైతాంగ ఉద్యమ నేత నుంచి అఖిల భారత కిసాన్ సభకు జాతీయ అధ్యక్షులయ్యారు. జైలు జీవితం కూడా అనుభవించారు. పెద్దగా చదువుకోకపోయినా ఇంగ్లీష్, హిందీ భాషలపై పట్టు సాధించారు. ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ సేవలు జిల్లాలో ప్రారంభిస్తున్నాం. వ్యవసాయ రంగంలో హరిత విప్లవాన్ని తీసుకొచ్చిన మహాగొప్ప శాస్త్రవేత్త ఎంఎస్.స్వామినాథన్. వ్యవసాయ రంగంలో రైతులకు అండగా ఆయన చేసిన కృషి ఎనలేనిది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంఎస్.స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తే రైతు అభివృద్ధి చెందుతాడు. ఈ సెమినార్‌కు ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ ఆహ్వానం పలకగా, ఎ.రవి వందన సమర్పణ చేశారు. సభ్యులు కె.రాజారామ్మోహన్‌రాయ్, డి.కళ్యాణి, జుత్తిగ నరసింహామూర్తి, కోశాధికారి డిఎన్‌విడి.ప్రసాద్, అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం కార్యదర్శి చెరుకువాడ సుబ్రమణ్యంరాజు, మేళం దుర్గా ప్రసాద్, వీరబాబు, రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కిలాడి శ్రీనివాస్, ప్రజాసంఘాల నేతలు కేతా గోపాలన్, కౌరు పెద్దిరాజు, పివి.ప్రతాప్, బి.వాసుదేవరావు, రామాంజనేయులు, ఎ.అజయకుమారి, పి.పూర్ణ పాల్గొన్నారు.

ఢిల్లీలో నిర్మించే రైతు భవనానికి నిధి అందజేత

ఢిల్లీలో నిర్మిస్తున్న రైతు భవనానికి రైతు కార్యాచరణ సమితి నేతలు పాతపాటి మురళీ రామరాజు రూ.20 వేలు, కలిదిండి గోపాలకృష్ణంరాజు రూ.20 వేలు, పేరిచర్ల లక్ష్మణవర్మ రూ.10 వేలు మొత్తం రూ.50 వేలు అందించారు. అలాగే ఆర్.రఘురామరాజు రూ.25 వేలు అందించారు. ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ తరపున రూ.50 వేల చెక్కును ఫౌండేషన్ ఛైర్మన్, కార్యదర్శి, సభ్యుల చేతుల మీదుగా అశోక్‌ధావలేకు అందజేశారు.



అశోక్ ధావలెకు నిధి చెక్కు అందిస్తున్న నేతలు

బాల్య వివాహాలు నిరోధించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, జెసి, అధికారులు

ప్రజాశక్తి - భీమవరం

బాల్య వివాహాల నిరోధానికి ప్రతిఒక్కరూ తమవంతు సామాజిక బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో గురువారం ఛైల్డ్‌రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహ ముక్తిభారత్ కార్యక్రమంలో భాగంగా వంద రోజుల ప్రచార కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27 నుండి మార్చి 8వ తేదీ వరకు ఈ అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. దేవాలయాలు, చర్చిలు, కళ్యాణ మండపాల్లో ఈ అవగాహనా కార్యక్రమాలు చేపడతారన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ పరిధిలో పెద్దఎత్తున బాల్య వివాహాల నిరోధానికి ప్రచారం చేపట్టాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తల్లిదండ్రులు 18 ఏళ్లలోపు బాలికలకు వివాహం చేయకూడదన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి వివిధ శాఖల జిల్లా అధికారులతో బాల్య వివాహాల నిరోధంపై ప్రతిజ్ఞ చేయించి వంద రోజుల ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. వంద రోజుల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఐసిడిఎస్ పీడీని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఐసిడిఎస్ పీడీ డి.లక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఎన్‌వి.అరుణకుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్.శ్రీనివాస్, డిసిపిఒ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి కేసుల విచారణ వేగవంతం చేయాలి

జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులకు సంబంధించి నమోదైన కేసుల విచారణ వేగవంతం చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో గురువారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. నూతన కమిటీ సభ్యులు కెసిహెచ్.పెద్దిరాజు, ఎం.నరేష్, కె.రాజశేఖర్, కొల్లు దొరబాబు, జగపతిరామయ్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 2024 డిసెంబర్ నుంచి 2025 మే వరకు బాధితులకు కోటీ 85 లక్షల 75 వేలు మోనిటరీ రిలీఫ్ కింద చెల్లించామన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులకు సంబంధించి ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్ నమోదులో ఎటువంటి జాప్యమూ లేకుండా చూడాలని డిఎస్‌పిలను ఆదేశించారు. జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీకి సంబంధించి 2025 మే నుండి అక్టోబర్ వరకు నరసాపురం సబ్ డివిజన్లో 2, భీమవరం సబ్ డివిజన్లో 4, తాడేపల్లిగూడెం సబ్ డివిజన్లో 8 కేసులు మొత్తం 14 కేసులు నమోదయ్యాయన్నారు. సంబంధిత కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కేసులకు సంబంధించి ఎఫ్ఐఆర్ దశలో రూ.6.25 లక్షలు, ఛార్జిషీట్ దశలో ఒక లక్ష బాధితులకు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పిలు జి.శ్రీవేద, డి.విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

7267 ఎపిక్ కార్డుల పంపిణీ

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి



ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఓటర్లుగా నమోదు చేసుకున్న వారికి ఇప్పటి వరకు 7,267 ఎపిక్ కార్డులను అందజేశామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్ అమరావతి నుండి జిల్లా కలెక్టర్లతో ఎలక్ట్రోరల్ రోల్ రివిజన్‌పై సమీక్షించారు. జిల్లా నుండి జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బిఎల్‌ఒ, ఎఇఆర్‌ఒలకు అందరికీ శిక్షణ పూర్తి చేశామన్నారు. బిఎల్‌ఒలకు ఐడి కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)లో ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియ సాగుతుందన్నారు. జిల్లాలో 7,432 ఎపిక్ కార్డులు వచ్చాయని, 7,267 కార్డులను పోస్ట్ ద్వారా ఓటర్లకు అందజేశారని వివరించారు. ఫారం-6, 7, 8 పెండింగ్లో 115 ఉన్నాయని ఎన్నికల ప్రధాన అధికారికి జెసి తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒలు కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దాసి రాజు, ఖతిబ్ కౌసర్‌భానో, ఎన్నికల సెక్షన్ డిప్యూటీ తహశీల్దార్ మద్రాపు సన్యాసిరావు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులు అభివృద్ధి చెందాలి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

విభిన్న ప్రతిభావంతులు అందొచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని సమాజంలో బాగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. డిసెంబర్ 3న నిర్వహించనున్న అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో డిఎన్ఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పారా క్రీడల పోటీలను కలెక్టర్ నాగరాణి గురువారం ప్రారంభించారు. తొలుత పారా క్రీడల కోసం అవగాహన నడకను కలెక్టర్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. బధిర విద్యార్థులతో కలిసి నడిచారు. అనంతరంఉత్సాహపర్చేలా కలిసి స్వయంగా కలెక్టర్ క్రికెట్ ఆడి బ్యాటింగ్, బౌలింగ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు ఏ రంగంలోనూ తీసిపోని విధంగా అన్ని రంగాల్లో పోటీ పడాలన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి శాఖాధికారి ఎం.మోహన్‌దాస్, డిఎన్ఆర్ కళాశాల వైస్ ఛైర్మన్ గోకరాజు పాండురంగరాజు, సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణ, రామకృష్ణంరాజు, పీడీ బివి.నరసింహారాజు, ఫిట్‌జోన్ జిమ్ నిర్వాహకులు దాసరి చందు, భీమవరం వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కందుల సురేష్, జిల్లా విజువల్లి ఛాలెంజ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కె.బాలాజీ, విజ్ఞాన వేదిక అధ్యక్షులు అల్లు శ్రీనివాస్, బధిర బాలబాలికలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ ఆందోళన



పెనుగొండలో..

ప్రజాశక్తి - పెనుగొండ

లేబర్ కోడ్‌ల అమలును వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యాన స్థానిక గోంగూర తూము సెంటర్లో గురువారం నిరసన చేపట్టారు. అంగన్వాడీ, ఆశ, విఒఎలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లేబర్ కోడ్‌ల వల్ల రానున్న కాలంలో కార్మికులు బానిసత్వంలోకి నెట్టబడతారని, కార్మిక వ్యతిరేక కార్మిక కోడ్‌లను రద్దు చేసే వరకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ నెల 29, 30 తేదీల్లో పెనుగొండలో జరిగే సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షురాలు కానూరి తులసి, నేత నాగిశెట్టి గంగారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్‌కె.పాదుషా తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి: లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని చించినాడ గ్రామంలో లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, డివైఎఫ్ఐ, కెవిపిఎస్, ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ కార్మికులు అనేక పోరాటాలు చేసి, ప్రాణాలు అర్పించిన ఫలితంగా ఎనిమిది గంటల పని సాధించుకున్నారని గుర్తు చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆ 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచడం దారుణమన్నారు.




చించినాడలో..

ఇప్పటికైనా లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు కానేటి బాలరాజు, బాతిరెడ్డి జార్జి, సరిపల్లి జయప్రభ, బాతిరెడ్డి సుగుణ, శెట్టిమి భాస్కరరావు, తాడి ఉదయ్‌కుమార్, ఆకుమర్తి ఏసురత్నం, పల్లేరు వెంకటస్వామి, గోగినేని సత్యనారాయణ, శెట్టిమి నాగమణి, సత్యవతి, రూతమ్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తమ ప్రాంతంలో చెత్త వేయొద్దంటూ నిరసన

మండవారిగరువులో హైటెన్షన్



నినదిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని రుస్తుంబాద పంచాయితీ పరిధిలోని మండవారి గరువులో గురువారం హైటెన్షన్ నెలకొంది. పట్టణంలోని చెత్తను గ్రామంలోని జగనన్నకాలనీ సమీపంలో ఖాళీగా ఉన్న ప్రదేశంలో వేసేందుకు రెండు లారీలు, నాలుగు ట్రాక్టర్లు వెళుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. అక్కడే టెంట్ వేసి ధర్నాకు దిగారు. వంటావార్పుతో నిరసన తెలిపారు. దీంతో ఆర్‌డిఒ దాసి రాజు, మాజీ ఎంఎల్‌ఎ కొత్తపల్లి జానకిరాం, మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, తహశీల్దార్ ఐవివి.సత్యనారాయణ, సిఐలు బి.యాదగిరి, జి.దుర్గాప్రసాద్, ఎస్ఐలు టి.వెంకట సురేష్, సిహెచ్.జయలక్ష్మి, హెచ్.మల్లికార్జున్ సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. పెద్దఎత్తున పోలీసు బలగాలను మోహరించారు. అయితే గ్రామస్తులు వెనక్కి తగ్గలేదు. తమ ప్రాంతంలో చెత్తను వేసేందుకు అనుమతిచ్చేది లేదని తేల్చిచెప్పారు. పట్టణంలో చెత్తను పచ్చని పొలాల మధ్య వేస్తే పంట కాల్వలు, వ్యవసాయం దెబ్బతింటుందని, సమీపంలోని మంచినీటి చెరువులో నీరు కలుషితమవుతుందని తెలిపారు. పట్టణంలో చెత్త వేసేందుకు తమ గ్రామమే దొరికిందా అంటూ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. అధికారులు గ్రామస్తులకు నచ్చజెప్పేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. చుట్టూ ఫెన్సింగ్, గోడ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ గ్రామస్థులు ఒప్పుకోలేదు. దీంతో అధికారులు తర్జనభర్జనలు పడుతున్నారు.



ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ అంజిబాబు

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేవి విద్యాలయాలే

సివి రామన్ స్కూల్‌ను ప్రారంభించిన ఎంఎల్‌ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో విద్యాలయాలే ముఖ్యపాత్ర పోషిస్తాయని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. స్థానిక సుంకర పద్దయ్య వీధిలో సివి.రామన్ స్కూల్‌ను గురువారం ఎంఎల్‌ఎ అంజిబాబు ప్రారంభించారు. ఆప్యాయతతో విద్యను బోధిస్తే విద్యార్థుల్లో మార్పు వస్తుందని, తల్లి, తండ్రి, గురువు, దైవం అంటారని, పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ రావణం వేణుగోపాల్, ప్రిన్సిపల్ పెండ్యాల సరిత, ఉపాధ్యక్షులు శైలజ, పార్వతి, అరసవల్లి సుబ్రహ్మణ్యం, లంకి చిన్ని, ముచ్చకర్ల శివ, విజ్జురోతి రాఘవులు, మైలాబత్తుల ఐజాక్ బాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

16న సిసిఎల్‌ఎ కార్యాలయం ముట్టడి

విఆర్‌ఎల సంఘం రాష్ట్ర జెఎసి కార్యదర్శి గణేష్‌రావు

ప్రజాశక్తి - పాలకోడేరు

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ 16న విజయవాడ సిసిఎల్‌ఎ కార్యాలయన్ని ముట్టడించనున్నట్లు ఉమ్మడి జిల్లా విఆర్‌ఎల సంఘం రాష్ట్ర జెఎసి కార్యదర్శి బి.గణేష్‌రావు అన్నారు. పాలకోడేరులో మండల గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం సమావేశం గురువారం నిర్వహిచారు. ఈ సందర్భంగా గణేష్‌రావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి విఆర్‌ఎలు అంతా కలిసికట్టుగా రావాలన్నారు. సిసిఎల్‌ఎ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా ట్రెజరర్ మోటూరి మోషే, వర్కింగ్ ప్రెసిడెంట్



నినదిస్తున్న విఆర్‌ఎలు, నేతలు

బివి.పండు, తాడేపల్లిగూడెం డివిజన్ ప్రెసిడెంట్ లంకపల్లి శ్రీకాంత్, భీమవరం డివిజన్ ప్రెసిడెంట్ ఎం.సుబ్బారావు, పాలకోడేరు మండల ప్రెసిడెంట్ సన్నమంద్ర నాని, మండల సలహాదారు రూబీయమ్మ పాల్గొన్నారు.

వైవి లంక మాజీ సర్పంచి మృతి

యలమంచిలి :మండలంలోని ఏనుగువానిలంక గ్రామ మాజీ సర్పంచి, మాజీ ఎంపిటిసి పాలపర్తి కుమారరత్నం (78) మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు, కుమార రత్నం గతంలో సుమారు 30 సంవత్సరాల పాటు సిపిఎం క్రియాశీలక సభ్యునిగా ఉన్నారు. సిపిఎం నుంచి ఎంపిటిసి సభ్యునిగా అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. గ్రామానికి సుమారు పాతిక సంవత్సరాలపాటు వార్డు మెంబర్‌గా కూడా కొనసాగారు.

దాతృత్వాన్ని అలవర్చుకోవాలి

ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

దాతృత్వాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. దాతలు అందిస్తున్న ప్రోత్సాహ కాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త చిలుకూరి విశ్వేశ్వరరావు సతీమణి చిలుకూరి కృష్ణవేణి జ్ఞాపకార్థం కేటాయించిన నిధులతో సజ్జాపురం 14వ నెంబర్ మున్సిపల్ స్కూల్ ఆవరణలో నిర్మించిన ఆర్‌ఒ ప్లాంటును ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రారంభించారు. డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్ తల్లిదండ్రులు దొమ్మేటి గోపాలకృష్ణమూర్తి, దొమ్మేటి ఇందిరాదేవి జ్ఞాపకార్థం రూ.లక్ష అందజేశారు. ఈ సందర్భంగా గురువారం స్కూలు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ రాధాకృష్ణ దాతలను అభినందించి మాట్లాడారు.

ఇలాగైతే ఐక్యతకు విఘాతం కాదా!

ప్రజాశక్తి - వీరవాసరం

రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడి ఐక్యంగా వైసిపిని ఎదుర్కొని రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఆ ఐక్యతకు విఘాతం కలిగేలా టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మీ తీరు ఉందని జనసేన మండల ఉపాధ్యక్షుడు వేంద్ర లీలావెంకటకృష్ణ అన్నారు. ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ టిడిపి ఆధ్వర్యంలో జనసేన, బిజెపి నాయకులను కలుపుకోకుండా తోకలపూడిలో అన్నదాత సుఖీభవ లబ్ధిదారులను కలిసే కార్యక్రమం నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఐక్యతకు విఘాతం కలిగించేలా కార్యక్రమాలు నిర్వహిస్తే వచ్చే స్థానిక ఎన్నికల్లో కూటమికి నష్టం కలిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతో అనుభవం ఉన్న సీతారామలక్ష్మీ కూటమి ఐక్యతకు విఘాతం కలిగించే విధానాలకు స్వస్తి చెప్పాలన్నారు.

నేడు యుటిఎఫ్ మండల నూతన కౌన్సిల్ ఎన్నిక

ప్రజాశక్తి - గణపవరం

ఈనెల 28న యుటిఎఫ్ మండల నూతన కౌన్సిల్ ఎన్నిక జరుగుతుందని మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.రమేష్, జిజి భగవాన్ ప్రసాద్ తెలిపారు. పిప్పర జిల్లాపరిషత్ హైస్కూల్లో జరిగే ఎన్నికకు పిడిఎఫ్ ఎంఎల్‌సి బి.గోపీమూర్తితో పాటు మండల ప్రజాసంఘాల నాయకులు హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా జరిగే సమావేశంలో 10 అంశాలపై చర్చలు జరుగుతాయన్నారు. మండల నాయకులు, సభ్యులు హాజరు కావాలని కోరారు.

సకాలంలో రీ సర్వే పూర్తి చేయాలి

ప్రజాశక్తి - యలమంచిలి

సకాలంలో రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా సర్వే అధికారి కె.జాషువా అధికారులను ఆదేశించారు. గ్రామాల మధ్య ఉన్న సరిహద్దులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వేను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో సమీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గ్రంధి పవన్ కుమార్, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ నీరందించడమే లక్ష్యం

డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - ఉండి

ప్రతి ఎకరాకూ నీరందించడమే లక్ష్యమని ఉండి ఎంఎల్‌ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు సూచన మేరకు మండలంలోని పెదపుల్లేరులో పంట బోదె ప్రక్షాళన పనులు నాంది పలికినట్లు నీటి సంఘం ఉపాధ్యక్షులు కలిదిండి కృష్ణంరాజు, పార్టీ గ్రామ అధ్యక్షులు నడిపల్లి సత్యనారాయణరాజు (సత్తిబాబు) అన్నారు. పెదపుల్లేరులో పంటబోదె తవ్వకాన్ని టిడిపి నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. ప్రతి రైతు ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో పంట బోదెల ప్రక్షాళన చేస్తున్నామని, దీంతో అధిక వర్షాలకు పంట ముంపునకు గురికాకుండా ఉంటుందని చెప్పారు. గ్రామంలో పంట బోదెను ఆనుకుని సుమారు 300 ఎకరాల వ్యవసాయం జరుగుతుందని, రైతు ఇబ్బందులను ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన వెంటనే పంట బోదె ప్రక్షాళన చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రక్షాళన పనులు ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి నడిపల్లి అర్జునరాజు, వార్డు సభ్యులు పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, రైతులు ఉన్నారు.

డ్రెయినేజీల నిర్వహణ మెరుగుకు చర్యలు

ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పట్టణంలో మురుగునీటి పారుదల సాఫీగా జరిగే విధంగా డ్రెయినేజీ నిర్వహణను మెరుగు పరుస్తామని ఎంఎల్‌ఎ, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో డ్రెయినేజీ, పారిశుధ్య నిర్వహణను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయినేజీ అవుట్‌లెట్లు సక్రమంగా లేకపోవడంతో మురుగునీటి ప్రవాహం సక్రమంగా జరగడం లేదని, అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహించకూడదని, ప్రజారోగ్య పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ రామకృష్ణ, తహశీల్దార్ ఎ.సునీల్‌కుమార్, ఎంఇ వెంకటరమణ, మున్సిపల్ టిపిఒ జగదీష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

ప్రజాశక్తి - గణపవరం

విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని, నైతిక విలువలు కలిగి ఉండాలని డిగ్రీ కాలేజీ లెక్చరర్ జివి.శారదదేవి, సిహెచ్.అనురాధ అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కొత్తపల్లిలో జరుగుతున్న క్యాంపులో పాల్గొన్న ఆమె విద్యార్థులతో మాట్లాడారు. ఐదో రోజు జరుగుతున్న కార్యక్రమంలో రోడ్లకు ఇరువైపుల విద్యార్థులు వంద మొక్కలు నాటారు. సిహెచ్.రామ మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ జి.వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆచంట

రానున్న రెండు రోజుల్లో మండలంలో తుపాన్ ప్రభావం పడుతుందని, రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ జి.కనకరాజు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శని, ఆదివారాల్లో తుపాన్ ప్రభావం జిల్లాపై పడుతుందని, రెండు రోజులపాటు ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే ఒకటి రెండు రోజులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని, తేమ శాతం ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని సూచించారు. మండలంలో 2100 టార్పలిన్, బరకాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

అనాథాశ్రమానికి టివి బహూకరణ

ప్రజాశక్తి - పెనుగొండ

నూతనంగా ప్రారంభించిన ప్రశాంతి అనాథాశ్రమానికి పెనుగొండ ఎస్ఐ కొప్పిశెట్టి గంగాధరరావు రూ.30 వేలు విలువైన టివిని బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలకు ఉచిత సేవలందిస్తున్న వారిని, ఛారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు కానిస్టేబుల్ బివి.రమణ చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. భవిష్యత్తులో కూడా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతి ఆశ్రమ అధ్యక్షులు బి.అరుణ, కె.లక్ష్మణరావు, బి.నాగరాజు, మండపాటి ఆదిత్య, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పేదవారి కన్నీరు తుడిచేది కూటమి ప్రభుత్వమేనని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో పెంటపాడు మండలం పెంటపాడు గ్రామానికి చెందిన నక్క పావనిదేవి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ.60 వేలు సిఎం సహాయ నిధి చెక్కును, మారంపల్లి గ్రామానికి చెందిన అల్లు వెంకటేశ్వరరావుకు రూ.50 వేల చెక్కును ఆయన లబ్ధిదారులకు, కార్యకర్తల చేతుల మీదుగా గురువారం అందించారు. ఈ సందర్భంగా విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అడపా ప్రసాద్, చాపల రమేష్, పైబోయిన రఘు, ఎన్వి.సత్యనారాయణ, కొప్పూర లక్ష్మారెడ్డి, దాసరి శ్రీనివాస్, మద్దాల మణికుమార్, పసల కొండ, మద్దిపాటి రవితేజ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కెపి.పాలెం గ్రామంలో ఉన్న జెడ్పి ఉన్నత పాఠశాల ఆవరణలో సాంఘిక శాస్త్ర దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రధానోపాధ్యాయురాలు పితాని ఇందిరా ప్రారంభించారు. సాంఘిక శాస్త్ర ఎగ్జిబిషన్ చంద్రయాన్-3, సోలార్ సిస్టం, పురాతన నాణెములు, భూకంపాలు, భూమి పొరలు, ట్రాఫిక్ సిగ్నల్, అగ్నిపర్వతాలు, ఆదివి పర్యావరణం తదితర అంశాలపై విద్యార్థులు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఎం.విష్ణుమూర్తి, జి.నర్సింహస్వామి, కె.కనకరత్నారావు, కె.శ్రీనివాస బాబు అవగాహన కల్పించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి కృష్ణమోహన్ పాఠశాల సిబ్బంది ఉన్నారు.

శివదేవుని చిక్కాలలో భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాలలో శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో ఆలయ సంప్రోక్షణ మహోత్సవం సందర్భంగా గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచి వద్దే చంద్రశేఖర్‌తో పాటు పలు గ్రామాల సొసైటీ అధ్యక్షులు, పెద్దలు పాల్గొన్నారు.



అన్నసమారాధనలో యాత్రికులు

ఉద్దరాజు రామం నేటి యువతరానికి ఆదర్శం

వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేశ్వరరావు



తాడేపల్లిగూడెంలో...

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్వాతంత్ర్య సమర యోధులు, జీవితాంతం ప్రజల పక్షాన నిలచి పోరాడిన యోధులు ఉద్దరాజు రామం ఈనాటి యువతరానికి ఆదర్శమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు అన్నారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఉద్దరాజు రామం 31వ వర్ధంతి సభ గురువారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఉద్దరాజు రామం చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్ కామ్రేడ్ ఉద్దరాజు రామం,సాధిస్తాం సాధిస్తాం ఉద్దరాజు రామం ఆశయాలను అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన ఉద్దరాజు రామం ఉన్నత కుటుంబంలో జన్మించి పేద, పీడిత ప్రజల కోసం నిరంతరం పనిచేశారన్నారు. కష్టజీవులకు రాజ్యాధికారం రావాలని నిరంతరం పార్టీలో పనిచేశారన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధులు ఉద్దరాజు రామంను ఈనాటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా, అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులుగా భాధ్యతలు నిర్వహిం చారన్నారు. రైతాంగ సమస్యలపై సుదీర్ఘకాలం పని చేశార న్నారు. ఉద్దరాజు రామం ఆశయాలను కొనసాగించాలని సిపిఎం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ వర్ధంతి సభలో జవ్వాది శ్రీను, అడపా లోవ, నరమాల కృష, దేశంశెట్టి సతీష్, అయినాల సత్యనారాయణ, చిట్టేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

తణుకు :రైతులు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నరసాపురం పార్లమెంట్ మాజీ సభ్యులు ఉద్దరాజు ఎనలేని కృషి చేశారని సిపిఎం సీనియర్ నాయకులు గార రంగారావు, పట్టణ కమిటీ సభ్యులు గుబ్బల గోపీ అన్నారు. స్థానిక అమర వీరుల భవనంలో స్వాతంత్ర్య సమరయోధుడు, అఖిల భారత రైతు సంఘం అధ్యక్షులు 31వ వర్ధంతి సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. జోహార్ ఉద్దరాజు రామం, సాధిస్తాం రామం ఆశయాలను, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గార రంగారావు, పట్టణ కమిటీ సభ్యులు గుబ్బల గోపీ మాట్లాడుతూ చిన్న నాటి నుంచే దేశ భక్తి కలిగిన వ్యక్తి ఉద్దరాజు రామం అన్నారు. నర్సాపురంలో ఉన్న కాళీ పట్టణంలో జమిందర్‌కు వ్యతిరేకంగా భూ పోరాటం సాగించారన్నారు. సిపిఎంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా పని చేశారని చెప్పారు. రైతులు, కార్మికులు, ప్రజల పక్షాన తుది శ్వాస విడిచే వరకు సమాజం మార్పు కోసం పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉషా, లక్ష్మి, వసంత, కుమారి, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల ప్రగతికి రైతన్నా మీకోసం యాప్

మండల వ్యవసాయాధికారి(ఎఒ) బి.దేవీ స్వరూప

ప్రజాశక్తి - పెనుమంట్ర



అన్నదాతల ప్రగతి కోసం వ్యవసాయ శాఖతో పాటు వివిధ శాఖల సహకారంతో రైతన్నా మీకోసం యాప్ వారోత్సవాలు జరుపుతున్నామని మండల వ్యవసాయాధికారి బి.దేవీస్వరూప అన్నారు. వారోత్సవాల సందర్భంగా ఆమె ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : ఈ కార్యక్రమ ఉద్దేశ్యం ఏమిటి?

ఎఒ : రైతులు పండించే వివిధ పంటలకు అవసరమైన నీటి భద్రత, సాంకేతికత, డిమాండ్ ఆధారిత వ్యవసాయం, ఆహార శుద్ధి, ప్రభుత్వ మద్దతు గురించి రైతులకు అవగాహన కలిగించడం.

ప్రశ్న : రైతన్నా మీకోసం యాప్ గురించి రైతులకు అవగాహన ఎలా కలిగిస్తారు?

ఎఒ : రైతులకు బహుళ ప్రయోజనం కలిగించే విధంగా ప్రభుత్వంలోని వ్యవసాయ శాఖ రూపొందించిన ఎపిఎఐఎంఎస్ యాప్ ప్రయోజనాలను రైతుల ఇళ్లకు వెళ్లి వివరిస్తాము.

ప్రశ్న : ఈ ప్రక్రియ ఎలా జరుగుతుంది?

ఎఒ : ప్రతీ మూడు రైతు కుటుంబాలను ఒక క్లస్టర్‌గా చేసి, వ్యవసాయ అనుబంధ శాఖల ప్రతినిధుల బృందాలు రోజుకు కనీసం 30 క్లస్టర్లను అనగా 90 కుటుంబాలను సందర్శించి, అవగాహన కలిగిస్తారు.

ప్రశ్న : ఇందులో ఎవరెవరి భాగస్వామ్యం ఉంది?

ఎఒ : ప్రధానంగా ఆర్ఎస్‌కె అసిస్టెంట్లు, గ్రామ రెవెన్యూ, మత్స్య, పశుసంవర్ధక, ఇంజినీరింగ్, నీటి వినియోగ సంఘం, ప్రాథమిక వ్యవసాయ సొసైటీల వారితో పాటు అభ్యుదయ రైతులు పాల్గొంటున్నారు.

ప్రశ్న : ఈ వారోత్సవాల లక్ష్యం ఏమిటి?

ఎఒ : ఈనెల 29 వరకు క్లస్టర్ వారీగా సందర్శించి, రైతులకు అవగాహన కల్పించడంతో పాటు వారినుండి సేకరించిన ఫిర్యాదులు, సూచనలు క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిక అందించి, రైతులకు ఏమి అవసరమో అవి ప్రభుత్వపరంగా కల్పిస్తాము.

అనుమతులు లేని లే అవుట్లలో స్థలాలు కొనుగోలు చేయొద్దు

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని సరిపల్లి గ్రామంలో అనుమతులు లేని లే అవుట్లలో స్థలాలు కొనుగోలు చేయొద్దని పంచాయతీ కార్యదర్శి డి.రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాధికారిక స్థలాలకు పంచాయతీ నుంచి వాటర్ పైపులు, రోడ్డు, డ్రెయినేజీలు వంటి సౌకర్యాలు కల్పించరని పేర్కొన్నారు. గ్రామంలో ప్రధాన సెంటర్ బ్యానర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. దీనిలో భాగంగా సరిపల్లిలో అనధికారికంగా లే అవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన యజమానులు ఈ స్కీమ్‌ను ఉపయోగించుకుని వచ్చే ఏడాది జనవరి 23వ తేదీ లోపు దరఖాస్తు చేసుకుంటే ఆ స్థలాలను రెగ్యులైజేషన్ చేస్తారని తెలిపారు.

పాల్ ల్యాబ్ పరిశీలన

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మార్టేరు శ్రీ వేణుగోపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న పాల్ ల్యాబ్‌ను రాష్ట్ర పరిశీలకులు బి.కిషోర్‌బాబు జిల్లా సమగ్ర శిక్ష ఎఎంఒ చంద్రశేఖర్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రిఫికేషన్ పనులను, మెటీరియల్ నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు చదువుల వెంకటనరేంద్ర, ఇన్‌ఛార్జి రవీంద్ర, పీడీ ప్రసాద్ రెడ్డి, నరసింహ రెడ్డి, సతీష్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు

వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాలలో పోస్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించడం, అపోహలను తొలగించడం, బాధితులకు సామాజిక మద్దతు పెంపొందించడం లక్ష్యమని చెప్పారు. ఈ నెల 27 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు జరిగే వివిధ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచినవారికి బహుమతులు, సర్టిఫికెట్లును డిసెంబర్ ఒకటో తేదీన ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ మాట్లాడారు. అనంతరం విద్యార్థులు పలు అంశాలపై సృజనాత్మక పోస్టర్లను రూపొందించి ప్రదర్శించారు.

ఉప్పలూరులో పారిశుధ్య మెరుగు పనులు

ప్రజాశక్తి - ఉండి

పారిశుధ్య మెరుగుకు చర్యలు చేపట్టడం ద్వారా వైరల్ జ్వరాలను అదుపులో ఉంచొచ్చని ఎంపిడిఒ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో సంపూర్ణ పారిశుధ్య నివారణ చర్యల్లో భాగంగా మండలంలోని గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారులు శానిటేషన్ సిబ్బంది పర్యటించి చెత్తాచెదారాన్ని తొలగించి డ్రెయినేజీల వద్ద బ్లీచింగ్ చల్లి సూపర్ శానిటేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సిఎస్‌వి.రెడ్డి, మండల విస్తరణాధికారి కేశిరెడ్డి గోపాలకృష్ణ, వివిధ గ్రామాల అభివృద్ధి అధికారులు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

అడవిపాలెంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల, పాలకొల్లు ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో అడవిపాలెంలో ఏడు రోజులు స్పెషల్ క్యాంపు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షతన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అడవిపాలెంలో పంచాయతీ వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక శిబిరంలో కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఏడు రోజులు 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలో సేవ, అవగాహన కార్యక్రమాలు, క్లీన్ అండ్ గ్రీన్, డోర్ టు డోర్ సర్వే బ్లడ్ గ్రూపింగ్ క్యాంపు, హెల్త్ క్యాంపులు నిర్వహిస్తారని తెలిపారు.

రాజ్యాంగాన్ని ప్రతి పౌరుడూ పరిరక్షించాలి

రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు సీతారాం

ప్రజాశక్తి - భీమవరం



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు మంతెన సీతారాం అన్నారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో రాజ్యాంగం దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్యాంగం - విశిష్టతపై యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ముఖ్య వక్తగా సీతారాం హాజరై డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశానికి స్వాతంత్రం ఇవ్వడానికి ముందు 1935 చట్టాన్ని అనుసరించి భారత రాజ్యాంగం రాయడానికి కావాల్సిన త్యాగపరిషత్తును 389 మంది సభ్యులతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దేశ విభజన కారణంగా భారతదేశం, పాకిస్తాన్‌గా విడిపోతున్న సందర్భంలో భారతదేశం రాజ్యాంగ పరిషత్తు 299 మంది సభ్యులతో పునర్వ్యవస్థీకరితమైందన్నారు. భారత రాజ్యాంగం ప్రధానంగా సర్వసత్తాక సార్వభౌమాధికార, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర అనే పిల్లర్లపై నిలబడిందన్నారు. ప్రజల హక్కులను రక్షించడానికి జ్యుడీషియరిని ఏర్పాటు చేసిందని, ప్రభుత్వాలు పౌరులు తమ బాధ్యతలను సక్రమంగా అమలు చేయటానికి తగిన ఆర్టికల్స్ రూపొందించిందని అన్నారు. రిజర్వేషన్లు దానిలో భాగమేనన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల జిల్లా సంఘం అధ్యక్షులు గాతల జేమ్స్, పి.శ్రీనివాసరాజు, రామలింగరాజు, బి.చైతన్యప్రసాద్, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, వి.సత్యస్వరూప్, టి.ప్రసాద్, పి.సాయికృష్ణ, బి.సింధు, మల్లుల శ్రీనివాస్, చింతపల్లి ప్రసాదరావు, బొర్రా నాగబాబు, రేపాక వెంకన్నబాబు, సిహెచ్.యశ్వంత్, కె.త్రిమూర్తులు పాల్గొన్నారు.

రసాభసాగా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - నరసాపురం



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిల్ సభ్యులు

మొంథా తుఫాన్‌కు నేలకొరిగిన చెట్లపై గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశం రసాభసాగా మారింది. కమిషనర్ అంజయ్య సరైన సమాధానం చెప్పకపోవడంతో సభను శుక్రవారానికి వాయిదా వేశారు. చైర్‌పర్సన్ బర్రి వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో 12వ వార్డు వైసిపి సభ్యులు సఖినేటిపల్లి సురేష్ మాట్లాడుతూ తుఫాన్ గాలులకు వంద ఏళ్ల నాటి భారీ వృక్షాలు నేలకొరిగాయని, వాటిని తొలగించి ఎక్కడ పెట్టారని ప్రశ్నించారు. దీనికి కమిషనర్ అంజయ్య నుంచి సరైన సమాధానం రాలేదు. దీంతో ఐదో వార్డు సభ్యులు వన్నెంరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ చెట్లు ఉన్నాయా... అమ్మేసారా.. ఎవరైనా పట్టుకెళ్లారా అంటూ నిలదీశారు. పడిన చెట్లు కోసిన దుంగలు మున్సిపల్ కార్యాలయంలో కనిపించడం లేదని, వాటిని విక్రయించారన్న ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. కమిషనర్ తనకు తెలియదని, దీనిపై విచారణ నిర్వహిస్తానని సమాధానం ఇచ్చారు. కమిషనర్ స్పష్టమైన సమాధానం ఇవ్వకపోవడంతో సమావేశాన్ని శుక్రవారానికి వాయిదా వేసినట్లు చైర్‌పర్సన్ వెంకటరమణ ప్రకటించారు. అంతకు ముందు గత నెలలో సమావేశాన్ని ఎందుకు నిర్వహించలేదని విసి కొత్తపల్లి నాని, కేసరి గంగరాజు, కోటిపల్లి సురేష్‌లు అధికారులను ప్రశ్నించారు. దీంతో పాటు పట్టణంలో పలు సమస్యలపై సిర్రా కాంతమ్మ, దుర్గాభవాని, రామసీత నిలదీశారు.

ఇంటింటికి చెత్త సేకరణపై అవగాహన

ప్రజాశక్తి - వీరవాసరం

జీరో వేస్ట్ పంచాయతీలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో మోడల్ ఎల్‌టిసి కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య నిర్వహణ అవగాహనా కార్యక్రమాన్ని గురువారం అండలూరులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్త సేకరణకు గ్రామస్తులు ఏ విధంగా సన్నద్ధం కావాలో వివరించారు. తాడేపల్లిగూడెం మండలంలో మారంపల్లి, వీరవాసరం మండలంలో అండలూరు, యలమంచిలి మండలంలో శిరగారపల్లి, పెనుగొండ మండలంలో వడిలి గ్రామాలను మోడల్ విలేజ్‌గా ఎంపిక చేశారు. 15 రోజుల్లో ఈ నాలుగు గ్రామాలను జల్లిడ పట్టి చెత్త సేకరించి జీరో వేస్ట్ పంచాయతీలుగా తీర్చిదిద్దాలన్న లక్షంగా డిపిఆర్‌సి సిబ్బంది పని చేస్తుందన్నారు. ఈ నాలుగు గ్రామాల్లో వచ్చిన ఫలితాలను పరిశీలించి ఆ తరువాత జిల్లా అంతటా ఈ కార్యక్రమం అమలు చేస్తారని డిపిఆర్‌సి కో-ఆర్డినేటర్ ఎడ్వర్డ్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి మాణిక్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డోర్ టు డోర్ సర్వేను రైతులు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట

రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న డోర్ టు డోర్ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు తెలిపారు. కరుగోరుమిల్లి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు గ్రామాల్లో రైతన్న మీకోసం ఇంటింటి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి బి.నాగరాజు మాట్లాడుతూ రానున్న ఐదేళ్లల్లో రైతును రాజును చేసేందుకు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, వ్యవసాయ యాంత్రీకరణ, ఫుడ్ ప్రాసెసింగ్, విధానాలతో కార్యాచరణ తయారు చేయనున్నట్లు చెప్పారు. రైతులందరి కోసం ప్రత్యేకంగా ఒక యాప్ తయారు చేశారని, డోర్ టు డోర్ సర్వేలో భాగంగా రైతులందరీ ఆండ్రాయిడ్ మొబైల్‌లో యాప్‌ను రైతు సేవ కేంద్రం ఇన్‌ఛార్జులు ఇన్‌స్టాల్ చేస్తారని, తద్వారా రైతులందరూ వారి వారి పంటల వివరాలు, మార్పులు, చేర్పులు, సలహాలు, సూచనలు ఈ యాప్ నుంచి పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

'కులగణన స్థానిక ఎన్నికల ముందు నిర్వహించాలి'

ప్రజాశక్తి - మొగల్తూరు

కులగణన స్థానిక ఎన్నికల ముందు నిర్వహించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు గుత్తుల తులసిగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొగల్తూరులో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.గంగారామ్, ప్రధాన కార్యదర్శి కండిబోయిన సుబ్రహ్మణ్యంతో కలిసి ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక కడలి చంటేశ్వరరావు కాంప్లెక్స్‌లో ఆ సంఘ నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు కడలి శ్రీమన్నారాయణ, మండల అధ్యక్షుడు మామిడి శెట్టి నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నూతన కమిటీల నియామకం అనంతరం జిల్లా స్థాయిలో బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నామని తెలిపారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నూతన కమిటీ ఏర్పాటు

నరసాపురం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా కడలి చంటి, మొగల్తూరు మండల గౌరవ అధ్యక్షునిగా వాటాల కృష్ణమూర్తి, మండల యువత అధ్యక్షుడిగా దొంగ శ్రీనివాస్, కార్యదర్శిగా దొంగ శ్రీను, మొగల్తూరు టౌన్ ఉపాధ్యక్షుడిగా చిమిలి ఆదినారాయణ ఎంపికయ్యారు. కమిటీ సభ్యులను శాలువాకప్పి ఘనంగా సత్కరించారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - యలమంచిలి

వరి సాగులో ఆధునిక పద్ధతులను అనుసరిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని నరసాపురం ఎడిఎ పివిఎన్ఎస్‌పి.ప్రసాద్ అన్నారు. మండలంలోని మట్లపాలెంలో గురువారం ఆయన పర్యటించి స్థానిక రైతుల నుంచి పలు వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరకు ధాన్యం విక్రయించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. వరి సాగుతో పాటు ఇతర ప్రత్యేక పంటలను సాగు చేస్తే పంటకు ఎరువుల వినియోగం తగ్గించుకునే అవకాశం ఉందని తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో రూ.తొమ్మిది లక్షలతో ఏర్పాటు చేసిన 33 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కూటమి నాయకులు బుధవారం ప్రారంభించారు. దీర్ఘకాలికంగా గ్రామస్తులు విద్యుత్ లో వోల్టేజీ సమస్యతో బాధపడుతున్నారు. సాధారణ రోజుల్లో సైతం ఫ్యాన్లు సరిగా తిరగక, లైట్లు వెలగక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక గ్రామానికి చెందిన జెడ్పిటిసి మాజీ సభ్యులు బోనం నాని, ప్రజలు కలిసి తమ సమస్యను మంత్రి రామానాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన విద్యుత్ సమస్యను తీర్చేలా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తానని మాట ఇచ్చి నెరవేర్చారు. ఈ సందర్భంగా టిడిపి మండలాధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

'పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి'

ప్రజాశక్తి - ఆచంట

కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తుందని ఎఐసిసి పరిశీలకులు పంజాబ్ మాజీ ఎంపీ జస్విన్ సింగ్ దింపా అన్నారు. ఆచంటలో పార్టీ సంస్థగత నిర్మాణ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆచంటలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నెక్కంటి వెంకట సత్యనారాయణ (సతీష్) అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలంటే మల్టీక్రాప్ దిశగా రైతులు ఎదగాలన్నారు. వరితో పాటు జొన్నలు, కందులు, రాగులు వంటి అనేక పంటలు వేయడం ద్వారా రైతులు అభివృద్ధి చెందుతారన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు పాతపాటి హరికుమార్‌రాజు, డిసిసి సభ్యులు జివి.హర్షకుమార్, డి.మురళీమోహన్‌రావు, గొల్ల కృష్ణతోపాటు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సూర్యాలయ నూతన అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - తణుకు

తణుకు పట్టణంలో ఎంతో విశిష్టత కలిగిన సూర్య దేవాలయం అభివృద్ధికి నూతన కమిటీ మరింత కృషి చేయాలని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. సూర్యాలయం అభివృద్ధి నూతన కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ పాల్గొని మాట్లాడారు. అధ్యక్షులుగా గమిని రామచంద్రరావుతో పాటు ధర్మకర్తలుగా కొయ్యని సత్యనారాయణ, బడేటి సాయిరాం, కల్వకుంట భవాని, చర్ల వెంకటసుబ్బలక్ష్మి, యజ్జాడ కృష్ణ, లంక దేవికుమారి, గంటా శ్రీదేవి, ఎలుబాడి నాగమణి, అంబుల సత్యనారాయణలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన వేగవంతం చేయండి

ప్రజాశక్తి - ఉండి

ఓటర్ల జాబితా పరిశీలన వేగవంతం చేయాలని ఉండి తహశీల్దార్ కావడి నాగార్జున, కాళ్ల తహశీల్దార్ సుందర్ సింగ్ అన్నారు. ఉండి తహశీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులకు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి స్థానిక సంస్థల ఎన్నికలు నేపథ్యంలో ఓటర్ల జాబితాను స్వచ్ఛీకరణ చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని, దీనిలో అలసత్వం వహించకుండా జాగ్రత్తగా పారదర్శకంగా నిర్వహించాలని వారు సూచించారు ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

ప్రజాశక్తి - నరసాపురం

ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహాయ సహకారాలను మహిళలు అందిపుచ్చుకుని ఆర్థిక పరిపుష్టి సాధించాలని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని వేములదీవి గ్రామంలో కేంద్ర హస్తకళలు, టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ సహకారంతో 32 మంది మహిళలకు కుట్టుమిషన్లను టిడిపి ఇన్‌ఛార్జి రామరాజుతో కలిసి అందించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి, మైలా వసంతరావు పాల్గొన్నారు.